# చైతన్యం

శ్రీ 'శాశాశ'

సాధనసమితి

"మాణిక్యం........................"

.......................

"మాణిక్యం......నిన్నే నే!"

.......................

"మాట్లాడవేం? నీ చదువు తగలెయ్య! యిదెక్కడ దాపరించిందే నీకు! ఎందుకొచ్చిన చదువే యిదీ? రోజూ యేదో పుస్తకాలో, పేపర్లో చదువుతూవుంటావు? నిన్ను చిన్నప్పుడు చదివించడం యెంత పాపం అయిపోయిందే!"

"చదువో, చదువో అని యేడుస్తావేం? ఇపుదేమంత మునిగిపోయింది అలాగ అరుస్తున్నావ్?"

"నెమ్మదే! అవతల శ్రేష్ఠిగారొచ్చారు. నీకోసం కూర్చునివున్నారు. త్వరగా వెళ్లు......"

"ఛీ! శ్రేష్టిగారంట శ్రేష్టిగారు! వాడూ నువ్వూకలిసి యేట్లోదిగండి. నే వెళ్లను......."

"ఇదేమిటే, మతిపోయిందేమిటే నీకూ? ఒక్కపిల్లవు కదా అని గారంగా చూసుకుంటే యెంతవరకూ వచ్చేవే?"

"నీ కెన్నిసార్లు చెప్పాను? యింత పెద్దదానవయ్యావు, బుద్ధిలేదూ నీకు? నాకావృత్తి చెయ్యడం యిష్టంలేదని చెప్పడంలేదూ?"

"అయ్యో! అయ్యో! యెక్కడైనావుందటే యిటువంటి అఘాయిత్యం! ఇదేమిటే కులవృత్తి మానేస్తానంటావ్? నలుగురూ నవ్వరూ? మన గౌరవం వుంటుందా యింక?"

"నీ ముఖం! గౌరవంకూడానా! మానాన్ని అమ్ముకోటం మానేస్తానంటే నవ్వుతారా?"

"మాన మేమిటి! మానం గీనం అని పుస్తకాల్లోచదివి కులవృత్తి మానేస్తావా? మన వంశంలో యెప్పుడైనా విన్నామా యిటువంటిది. లేకపోతే పొట్టగడవటం యెలాగా!"

"పొట్టే గడవదూ? బ్రతికే వాళ్ళంతా యీ వృత్తితోటే బ్రతుకుతున్నారా? యీ వృత్తితో బ్రతికేకంటే అడుక్కుని తింటే మెరుగు."

"అర్థమైన పుస్తకాలూ చదివి యిలాగా నేర్చేవు...అదుగో ఆయన పిలుస్తున్నాడు. బాగుండదు అవతల పెద్దమనిషి వచ్చినప్పుడు."

"పెద్దమనిషా? పశువా? నా కిష్టంలేదని చెప్పితే వాడికి బుద్ధిలేదూ? యింకా తిరుగుతాడు!"

"భోగంవాళ్ళకి యిష్టమేమిటే? మన వృత్తిమనం చేసుకోవద్దూ? ఎంత పాపం వచ్చిపోయింది! అవతల ఆ పెద్దమనిషివచ్చి కూర్చున్నాడు, యేం చెప్పేది?"

"యేం చెప్పేదా? యీసారివస్తే యెముకలు విరగగొట్టిస్తానని చెప్పు జ్ఞానంలేదూ, గడ్డి తింటున్నాడా!"

"నెమ్మదిగా మాట్లాడవే ఆయనకి వినబడుతుంది! మళ్ళీ మన గుమ్మం తొక్కుతాడా?"

"వెధవ! యీసారి గుమ్మం తొక్కాడంటే వాణ్ని విన్నూకూడా యీడిపిస్తాను."

"యెంత కర్మంవచ్చింది! యేం జెయ్యనూ? యీవేళ కేదోచెప్పి పంపేస్తాను......"

ఇదేతంతు నాలుగు రోజులనుంచి తాయారు యింట్లో. తాయారు ఆ చుట్టు ప్రక్కలకు ప్రసిద్ధికెక్కినవేశ్య. తన కాలంలో మంచి అందంగానూ, నాజూకుగానూ వుండేది. కూతురు మాణిక్యంకూడా యిప్పుడలాగేవుంది. వుదయిస్తున్న యౌవనం, వికసిస్తూన్న అంగసౌష్టవం. చిన్నప్పుడు యేదో కొంతవరకూ చదువుకుంది, జ్ఞానాభిలాషవల్ల ఆ కొద్దిచదువునే వృద్ధిచేసుకుని శాస్త్రాలు, రాజకీయాలు అర్థంచేసుకోగల శక్తి సంపాదించింది. వేశ్యవృత్తిలో వున్న నీచత్వాన్ని, ఆత్మగౌరవ భంగాన్ని గ్రహించింది. తల్లి వృత్తిలోనికి దింపబోతే తిరుగబడింది. శాయశక్తులా తల్లి ప్రయత్నాలను అడ్డుకుంది. తన్ను చెరపవచ్చిన వాళ్ళనందర్నీ వెనకా ముందూ చూడకుండా నిలబెట్టి కడిగేసింది.

తాయారు మాత్రం తనపట్టు విడవలేదు, వీళ్ళూ, వాళ్ళూచెప్పిన మాటలువినీ, యేవో పుస్తకాలూ చదివి చెడిపోయిందనీ, పట్టుపట్టితే దారిలోకి వస్తుందని తాయారు వుద్దేశం, యెన్నోవిధాల బ్రతిమాలింది కూతుర్ని, వినకపోతే భయపెట్టింది, యెంతచెప్పినా సరే మాణిక్యం భల్లూకపు పట్టుపట్టింది. అంత కంతకూ తల్లిపోరు యెక్కువై పోతూంది. ఇంక లాభంలేదని నిరాహార దీక్షపూనింది. దాంతోనైనా తల్లి మనస్సు తిరుగుతుందేమోనని. కాని కూతురుకంటె పైది తల్లి. తాయారుకూడా వుపవాసం మొదలెట్టింది. వేశ్యవృత్తిలో దింపితే చచ్చిపోతానని కూతురు, ~ దిగకపోతే చచ్చిపోతానని తల్లి,

ఇరుగు పొరుగువాళ్లు నలుగురూ కూడేరు, మాణిక్యం పట్టుదలచూస్తే వాళ్ళకి ఆశ్చర్యం, జాలికూడా కలిగింది. ఆ చివరకి యెలాగైతే నలుగురూ కలిసి తల్లిని వొప్పించారు మాణిక్యం తన యిష్టం వచ్చినట్లు ప్రవర్తించడానికని.

వేశ్యావృత్తిమీద కలిగిన విప్లవబీజాలతో పాటు మాణిక్యంలో జాతీయతాభావాలుకూడా మొలకలెత్తాయి. దేశాన్ని ప్రేమించడం, దేశసేవ చెయ్యడానికి కుతూహలం ఆమెలో వృద్ధిపొందాయి. దేశస్వాతంత్ర్యంకోసం తోటి దేశీయులుచేస్తూన్న సేవలో పాల్గొనాలని తీవ్ర అభిలాషకలిగింది.

మహాత్ముని నాయకత్వాన్ని దాస్య విమోచనంకోసం దేశంలో సత్యాగ్రహం జరుగుతూంది. దేశసేవాభిలాషియైన మాణిక్యం చిన్న హృదయం ఆగింది కాదు. మహాత్ముడికివ్రాసి అనుజ్ఞాపత్రం తెప్పించుకుంది. సత్యాగ్రహంచేసింది. ఇపుడు కారాగారవాసం చేస్తూంది.

అనాధులైన బాలబాలికల్లో యిటువంటి రత్నాలు యెన్నివున్నాయో!

(విషయం జరిగింది. రచనమట్టుకే నాది)